సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం ı 11 ı ఫిబ్రవరి ı 2023



చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.34 వేలు పలికినట్లు అధికారులు తెలిపారు.



టమాట కిలో రూ.16

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.16, కనిష్టం రూ.4, సరాసరిన రూ.10 ప్రకారం పలికాయి.

గరిష్టం/కనిష్టం
36.6°/12.4°

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం అక్కడక్కడా చలి వాతావరణం కనిపించింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు లేదు

కొత్తచెరువు: జనవరి నెలలో సంక్రాంతి సందర్భంగా ఒక రోజు అదనంగా సెలవు ఇచ్చిన నేపథ్యంలో నేడు రెండో శనివారం అయినప్పటికీ జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద ఉన్న పాఠశాలలు యథావిధిగా పనిచేస్తాయని ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలకు ఈనెలలో రెండో శనివారం సెలవు లేదని స్పష్టం చేశారు.

పాడి రైతులకు ‘అమూల్’ శుభవార్త

కదిరి అర్బన్: పాడి రైతులకు కైరా జిల్లా కోఆపరేటివ్ పాల ఉత్పత్తిదారుల సమితి(అమూల్) శుభవార్త చెప్పింది. జగనన్న పాల వెల్లువ పథకం కింద పాల సేకరణ ధర వరుసగా నాలుగోసారి పెంచింది. లీటర్ ఆవుపాలకు రూ.32.12 ఇస్తుండగా, దాన్ని సవరించిన రూ.34.59 చేశామని, లీటర్ గేదెపాలకు రూ.44.97 ఇస్తుండగా, ధర సవరించిన రూ 45.96కు పెంచినట్లు అమూల్ డెయిరీ ఇన్‌చార్జ్ వింజమూరి ఉదయ్ కిరణ్ తెలిపారు. పెంచిన ధర శనివారం నుంచి అమల్లోకి రానున్నట్లు వెల్లడించారు. దీంతో అన్నమయ్య, వైఎస్సార్ కడప, చిత్తూరు, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లో అమూల్‌లు పాలుపోసే 11,000 మంది పాడిరైతులు ప్రయోజనం కలుగుతుందన్నారు.

పర్యాటకులకు ఇబ్బందులు కలగనివ్వం

- టూరిస్ట్ పోలీస్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ



టూరిస్ట్ పోలీస్ కేంద్రం గురించి డీఎస్పీతో చర్చిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

లేపాక్షి: పర్యాటక కేంద్రాల్లో పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ తెలిపారు. లేపాక్షికి వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వబోమన్నారు. లేపాక్షి నంది విగ్రహం ముందు ఏర్పాటు చేస్తున్న టూరిస్ట్ పోలీస్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో టూరిస్టులకు ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించిందన్నారు. ఈ నేపథ్యంలోనే లేపాక్షిలో టూరిస్ట్ పోలీస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. ఆయన వెంట పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్, రూరల్ సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ ఉన్నారు.

పలు ప్యాసింజర్ రైళ్లకు అదనపు కోచ్‌లు

గుంతకల్లు: తిరుపతికి వెళ్లే పలు ప్యాసింజర్ రైళ్లకు అదనపు కోచ్‌లు ఏర్పాటు చేసినట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్.రాకేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కదిరిదేవరపల్లి – తిరుపతి – కదిరిదేవరపల్లి (రైలు నం.07589/90) ఈ ప్యాసింజర్ రైళ్లకు 1 జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ను శనివారం నుంచి జత చేస్తున్నట్లు వెల్లడించారు. గుంతకల్లు – తిరుపతి – గుంతకల్లు (07655/56) ఈ రైళ్లకు ఈ నెల 13 నుంచి రెండు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లను అదనంగా జత చేస్తామని తెలిపారు. ఇక గుంతకల్లు – చిక్‌జాజూర్ – గుంతకల్లు (07586/85) ప్యాసింజర్ రైళ్లకు ఈ నెల 15 నుంచి అదనంగా రెండు సెకండ్ క్లాస్ కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఉపాధికీ ఆధార్!

- జాబ్‌కార్డుతో అనుసంధానం తప్పనిసరి
- లింక్ చేసుకోకపోతే బిల్లు చెల్లింపులు బంద్
- జిల్లాలో చివరి దశకు చేరుకున్న ప్రక్రియ
- అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వ నిర్ణయం



మడకశిర మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

2,97,501
జిల్లాలో జాబ్‌కార్డుల సంఖ్య

5,70,586
ఉపాధి పనులు చేస్తున్న కూలీల సంఖ్య

5,27,479
ఆధార్ అనుసంధానం చేసుకున్నవారు

43,107
ఆధార్ లింక్ చేసుకోని కూలీలు

సాక్షి, పుట్టపర్తి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలను పూర్తిగా అరిట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకువస్తూనే ఉంది. ఈ క్రమంలోనే కూలీల జాబ్ కార్డులను ఆధార్ కార్డులతో తప్పనిసరిగా అనుసంధానం చేయాలని ఆదేశించింది. కూలీల పేర్లు కూడా ఆధార్ కార్డులో ఉన్న విధంగానే జాబ్ కార్డుల్లోనూ నమోదు చేయాలని సూచించింది. దీంతో ఉపాధి హామీ పథకంలో బోగస్ కూలీలకు పూర్తిగా చెక్ పడుతుంది. అంతేకాకుండా బిల్లుల చెల్లింపుల్లో కూలీల బ్యాంక్ ఖాతాల సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

ఆధార్ ఉంటేనే వేతనం..

ఉపాధి హామీ జాబ్‌కార్డుతో ఆధార్ కార్డు అనుసంధానం తర్వాత కూలి డబ్బులు నేరుగా బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతాయి. ఆధార్ అనుసంధానం లేని కూలీలు పనులు చేసినా.. ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశం ఉండదు. ప్రస్తుతం ఉపాధి కూలీలకు బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారు. కొన్ని చోట్ల కూలీలు హాజరు కాకున్నా వేతనాలు పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ అనుసంధానం విధానాన్ని తెరపైకి తీసుకొచ్చింది.

ఢిల్లీ నుంచి నిఘా ..

ఇక నుంచి ఆధార్ లింకు అయిన బ్యాంక్, పోస్టల్ ఖాతాల్లో మాత్రమే కూలీల వేతనాలు జమ కానున్నాయి. పబ్లిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ ద్వారా డబ్బులు ఎక్కడికి వెళ్తున్నాయనేది ఢిల్లీ నుంచి అధికారులు నేరుగా పర్యవేక్షించే వెసులుబాటు కలుగుతుంది.

శరవేగంగా అనుసంధాన ప్రక్రియ..

ఉపాధి హామీ జాబ్ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ జిల్లాలో శరవేగంగా సాగుతోంది. జిల్లాలో మొత్తం 5,70,586 మంది ఉపాధి కూలీలు ఉండగా, ఇప్పటి వరకు 5,27,479 మంది జాబ్‌కార్డులతో ఆధార్‌ను అనుసంధానం చేసుకున్నారు. ఉపాధి కూలీల పేర్లు ఆధార్‌కార్డులో ఎలా ఉందో జాబ్‌కార్డులోనూ అలాగే ఉండాలన్న నిబంధనతో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.

త్వరలోనే వందశాతం పూర్తి



ఉపాధి హామీ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు కూలీల జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నాం. ఈ ప్రక్రియ జిల్లాలో శరవేగంగా కొనసాగుతోంది. పెండింగులో ఉన్న వాటిన్నింటినీ త్వరలోనే పూర్తి చేస్తాం.
– రామాంజనేయులు, డ్వామా పీడీ, శ్రీ సత్యసాయి జిల్లా

దివ్యాంగులకు ‘కోడ్’ కష్టం

- ట్రై సైకిళ్ల మంజూరుకు అర్హుల ఎంపిక ప్రక్రియ వాయిదా

పుట్టపర్తి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దివ్యాంగులకు తీరని కష్టం తెచ్చింది. ప్రభుత్వం అందించే ట్రై సైకిళ్ల కోసం అర్హుల ఎంపికను ఈనెల 14న నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల ‘కోడ్’ కారణంగా వాయిదా వేసినట్లు విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ అబ్దుల్ రసూల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసిన తర్వాత అందరికీ సమాచారం ఇచ్చి ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. అందువల్ల ఈనెల 14న విభిన్న ప్రతిభావంతులెవరూ కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

పిట్ట కొంచెం.. ప్రతిభ ఘనం

- ఇండియాస్ వరల్డ్ రికార్డ్స్‌లో ‘పురం’ చిన్నారికి చోటు



చిన్నారి నైనిక

హిందూపురం టౌన్: తన ప్రతిభలో ఏడాది వయస్సున్న చిన్నారి ఇండియాస్ వరల్డ్ రికార్డ్స్(ఐడబ్ల్యూఆర్)లో చోటు దక్కించుకుంది. హిందూపురం శ్రీకంఠపురంలో నివాసముంటున్న డాక్టర్ చరణ్‌కుమార్, సుష్మాల కుమార్తె జి.నైనిక వయస్సు ఏడాదే. కానీ 12 గృహోపకరణాలను, 10 జంతువులను గుర్తుపట్టడంతో పాటు 10 జంతువుల శబ్దాలనూ చేయగలదు. ఈ నేపథ్యంలో ఐడబ్ల్యూఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన చిన్నారి నైనిక ప్రతిభను వీడియోల రూపంలో పరీక్షించారు. ఇందులో చిన్నారి ఇంటిలోని 12 వస్తువులను, అలాగే 10 జంతువులను గుర్తు పట్టి వాటి శబ్దాలు చేయడంతో ‘యంగ్ గెస్ట్ ట్యాలెండ్ కిడ్’గా రికార్డును అందజేశారు. ఈ మేరకు సర్టిఫికేట్‌ను శుక్రవారం అందజేశారు.

రెన్యూవల్‌కు గ్రీన్ సిగ్నల్

- వచ్చే ఏడాది 150 ఎంబీబీఎస్ సీట్లలో అడ్మిషన్‌కు ఎన్‌ఎంసీ అనుమతి
- కొత్తగా మంజూరైన సీట్లపై ఐదేళ్ల పాటు వరుసగా ఎన్‌ఎంసీ తనిఖీలు
- ఈసారి అనుమతిస్తూ అనంతపురం వైద్య కళాశాలకు ఎన్‌ఎంసీ లేఖ
- త్వరలోనే మెడికల్ కాలేజీకి.. మరో 65 పీజీ వైద్యసీట్లు



కొత్తగా వచ్చే పీజీ వైద్య సీట్లు ఇలా	
విభాగం	సీట్లు
అనాటమీ	3
రేడియో డయాగ్నసిస్	12
పల్మనరీ మెడిసిన్	5
మైక్రోబయాలజీ	7
ఫార్మకాలజీ	5
ఫోరెన్సిక్ మెడిసిన్	7
జనరల్ మెడిసిన్	8
గైనకాలజీ	9
ఆర్థోపెడిక్స్	9

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలకు కొత్తగా మంజూరైన ఎంబీబీఎస్ సీట్ల రెన్యూవల్‌కు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ మేరకు ఎన్‌ఎంసీ (నేషనల్ మెడికల్ కమిషన్) నుంచి ప్రిన్సిపాల్‌కు లేఖ అందింది. 2019 వరకు వైద్యకాలేజీలో 100 ఎంబీబీఎస్ సీట్లు ఉండేవి. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక అంటే 2019లో మరో 50 సీట్లు వచ్చాయి. ఇలా కొత్తగా మంజూరైన సీట్లను కాపాడుకోవాలంటే ఎన్‌ఎంసీ (మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో ఏర్పాటు చేసిన) ప్రతి ఏటా వసతులు, అధ్యాపకులు వంటి వాటిపై ఐదేళ్ల పాటు తనిఖీలు నిర్వహిస్తుంది. ఈ ఐదేళ్లలో అన్ని వసతులూ ఉంటేనే ఎన్‌ఎంసీ అనుమతిస్తుంది. లేదంటే రద్దు చేస్తుంది. పదిరోజుల క్రితం ఎన్‌ఎంసీ బృందం తనిఖీలకు వచ్చింది. ఇక్కడి వసతుల కల్పనలో సంతృప్తి చెంది 2023–24 సంవత్సరానికి 150 ఎంబీబీఎస్ సీట్లకు అడ్మిషన్లు నిర్వహించుకోవచ్చని ఈ నెల 9న కళాశాలకు ఎన్‌ఎంసీ లేఖ రాసింది.

భారీగా నియామకాలు చేపట్టడం వల్లే..

కనీ వినీ ఎరుగని రీతిలో అనంతపురం వైద్య కళాశాలకు అధ్యాపకులను నియమించడం వల్లే ఎంబీబీఎస్ సీట్లకు ఢోకా లేకుండాపోయింది. ప్రస్తుతం 108 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండగా.. అందులో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 56 మందిని శాశ్వత ప్రాతిపదికన నియమించారు. దీంతో పాటు మరో 50 మందిని వివిధ కేటగిరీల్లో పారామెడికల్ ఉద్యోగులను నియమించారు. నాడు – నేడు పనుల్లో భాగంగా రూ.300 కోట్లతో పనులు చేపట్టారు. త్వరలోనే క్యాన్సర్ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆస్పత్రిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

త్వరలోనే 65 పీజీ వైద్య సీట్లు..

ప్రస్తుతం 72 పీజీ వైద్యసీట్లు ఉండగా.. త్వరలో మరో 65 సీట్లు రానున్నాయి. దీనికోసం 60 శాతం అంటే రూ.48.8 కోట్లు కేంద్ర ప్రభుత్వం వ్యయం చేయనుండగా, మిగతా 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చనుంది. ఇప్పటికే ప్రతిపాదనలు ఎన్‌ఎంసీకి పంపించగా.. అక్కడి నుంచి అనుమతులు కూడా వచ్చాయి. దీనికోసం వసతుల కల్పన జరుగుతోంది.

సీట్ల కొనసాగింపుపై హర్షం..

ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 2023–2024 విద్యా సంవత్సరానికి 150 ఎంబీబీఎస్ సీట్లను రెన్యూవల్ చేస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాలలో పూర్తి ప్రమాణాలు పాటిస్తుండడం, ప్రొఫెసర్లు, బోధనాస్పత్రి నిర్వహణ అంశాలను పరిగణనలోకి తీసుకుని రెన్యూవల్‌కు అనుమతులు ఇచ్చింది. ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

అనుమతులు వచ్చాయి..

అనంతపురం మెడికల్ కాలేజీలో 150 ఎంబీబీఎస్ సీట్లకు వచ్చే ఏడాది అడ్మిషన్ చేసుకునేందుకు ఎన్‌ఎంసీ నుంచి అనుమతి వచ్చింది. తనిఖీల బృందం సంతృప్తి చెందిన తర్వాతే అనుమతులు ఇచ్చారు. త్వరలోనే పీజీ వైద్య సీట్లు కూడా రానున్నాయి. దీనికోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. – డాక్టర్ మైరెడ్డి నీరజ, ప్రిన్సిపాల్, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ

‘బెస్ట్’ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ట్యూషన్ ఫీజు కోసం వేధింపులు
- పరీక్షకు అనుమతించని వర్సిటీ అధికారులు
- మనస్తాపంతో అగ్రి విద్యార్థి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు ప్రయత్నించిన మనోహర్‌ను 108లో హిందూపురం తరలిస్తున్న దృశ్యం

గోరంట్ల: కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదు. ట్యూషన్ ఫీజు చెల్లించకపోతే యూనివర్సిటీ అధికారులు పరీక్షలకు అనుమతించడం లేదు. ఏం చేయాలో తెలియని ఆ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన శుక్రవారం గోరంట్లలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత విద్యార్థి స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం....కొత్తచెరువుకు చెందిన మనోహర్ కమ్మలవాండ్లపల్లి సమీపంలోని బెస్ట్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఏజీబీఎస్సీ నాల్గో సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో యూనివర్సిటీకి చెల్లించాల్సిన ట్యూషన్ ఫీజులో కొంత మొత్తం చెల్లించలేకపోయాడు. దీంతో యూనివర్సిటీ అధికారులు అతన్ని శుక్రవారం నిర్వహించిన సెమిస్టర్ పరీక్షకు అనుమతించలేదు. దీంతో అతను తన కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ తనకు గడువు ఇవ్వాలని కోరారు. అయినప్పటికీ యూనివర్సిటీ అధికారులు వినిపించుకోకపోవడంతో మనస్తాపం చెందాడు. శుక్రవారం సాయంత్రం గోరంట్లలోని తాను ఉంటున్న రూంలో క్రిమిసంహారక మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన తోటి విద్యార్థులు వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యం చేయించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అన్నదాన భవనం ప్రారంభం



చండీహోమంలో పాల్గొన్న సజ్జనార్, రఘువీరారెడ్డి

లేపాక్షి: ప్రపంచ పర్యాటక ప్రాంతాల్లో పేరుగాంచిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయానికి సమీపంలో నిర్మించిన అన్నదాన భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆగమికులు సునీల్‌కుమార్ శర్మ నేతృత్వంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఉదయం 4 గంటలకు గోపూజ, సింహద్వారా మహాలక్ష్మి పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హోమాలు నిర్వహించారు. దేవిభాగవతంలోని దుర్గాదేవి మహాత్యం వివరించారు. చండీహోమ కర్తలుగా మాజీమంత్రి రఘువీరారెడ్డి, తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ప్రముఖ న్యాయవాది శివమూర్తి దంపతులు నిర్వహించారు. అన్నదాన సేవా ట్రస్ట్ సభ్యులు రామాంజనేయులు, రాంప్రసాద్, అంజినరెడ్డి మాట్లాడుతూ... రూ.60 లక్షల వ్యయంతో అన్నదాన దాన భవనాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేశామన్నారు. వీరభద్రాలయానికి వచ్చే పర్యాటకులకు మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కల్పించడమే శ్రీదుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి అన్నప్రసాద సేవా ట్రస్ట్ ప్రధాన ధ్యేయమన్నారు. అన్నదాన భవనానికి ఆర్థిక సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ట్రస్ట్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్, హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, మాజీ ఎంపీపీలు రామకృష్ణారెడ్డి, ఆనంద్‌కుమార్‌తో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెళ్లింట కానుక కాంతులు

- పేదింటి ఆడపిల్లల వివాహాలకు జగన్ సర్కార్ చేయూత
- కల్యాణమస్తు, షాదీ తోఫా నిధులు విడుదల చేసిన సీఎం
- జిల్లాలోని 282 మంది ఖాతాల్లో రూ.2.23 కోట్లు జమ



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఆడ పిల్లల పెళ్లిళ్లు చేసిన పేదల కుటుంబాల ఇంట జగన్ సర్కార్ కాంతులు నింపింది. ఆర్థిక భరోసా ఇస్తూ అండగా నిలిచింది. నూతన దంపతులకు పెళ్లి కానుకగా సీఎం ఇచ్చిన ఆర్థిక సాయంతో వారి మోముల్లో ఆనందం వికసించింది. గత ఏడాది అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో వివాహాలు చేసుకున్న పేదింటి జంటలకు వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద అందించే ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి విడుదల చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు జిల్లాలోని 282 మంది లబ్ధిదారులకు రూ.2.23 కోట్ల మెగాచెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శివరంగ ప్రసాద్ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని పేద ఆడ పిల్లల వివాహాలకు ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు. వధువు వయస్సు 18 ఏళ్లు, వరుడి వయస్సు 21 ఏళ్లు దాటి, కనీసం పదో తరగతి ఉత్తీర్ణులైన వారే పథకానికి అర్హులన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకూ ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. పథకం కోసం అర్హులు వివాహం జరిగిన తేదీ నుంచి 60 రోజుల్లోపు వలంటీర్ల ద్వారా స్థానిక సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద జిల్లాలో 196 మంది బీసీలకు, 60 మంది ఎస్సీలకు, 26 మందికి ఎస్టీలకు కలిపి 282 మందికి నగదు జమ చేశామన్నారు.

అన్నలా ఆదుకున్నారు



మేము ఎన్నో ఇబ్బందులు పడి కులాంతర వివాహం చేసుకున్నాం. కుటుంబ పోషణ ఎలా అని ఆలోచిస్తున్న సమయంలో వలంటీర్ ద్వారా విషయం తెలిసి దరఖాస్తు చేసుకున్నాం. వెంటనే ప్రభుత్వం మాకు రూ.1.20 లక్షలు మంజూరు చేసి శుక్రవారం ఖాతాలో జమ చేసింది. నిజంగా సీఎం అన్నలా మమ్మల్ని ఆదుకున్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.
– గోవిందనాయక్, సాయిలక్ష్మి, సాయినగర్, పుట్టపర్తి

నా భార్యను చదివిస్తా



ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కావాలన్నది నా భార్య కల. సీఎం జగనన్న కళ్యాణమస్తు కింద ఇచ్చిన రూ.50 వేలతో ఆమెను డీఎస్సీ కోచింగ్ పంపి చదివిస్తా. నిరుపేదల గురించి ఇంతలా ఆలోచించే ముఖ్యమంత్రి దేశంలోనే ఎక్కడా లేరు. భగవంతుడు అవకాశం ఇస్తే ఆయన రుణం ఎప్పటికైనా తీర్చుకుంటాం.
– చంద్రశేఖర్, సుకన్య, ములుగూరు, హిందూపురం

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతి



జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన కారు





ప్రమాదంలో మృతి చెందిన హనుమంతు, చెన్నమ్మ

కనగానపల్లి: మండల పరిధిలోని పర్వతదేవరపల్లి సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మడకశిరకు చెందిన హనుమంతు(45) విద్యుత్‌శాఖ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. తన తల్లి చెన్నమ్మ (85) మధుమేహంతో బాధపడుతుండగా, అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించేందుకు శుక్రవారం కారులో బయలుదేరాడు. వీరు ప్రయాణిస్తున్న కారు పర్వతదేవరపల్లి సమీపంలోని రాగానే ముందు చక్రం పగిలిపోయింది. దీంతో కారు అదుపు తప్పి రహదారి పక్కన గుంతల్లోకి వెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో హనుమంతుతో పాటు చెన్నమ్మ కూడా తీవ్రంగా గాయపడింది. వెంటనే స్పందించిన హైవే పెట్రోలింగ్ సిబ్బంది వారిని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా...మార్గమధ్యంలోనే ఇద్దరూ మృతి చెందారు. హనుమంతుకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కనగానపల్లి ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కదిరి టౌన్: పట్టణంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను శుక్రవారం డిప్యూటీ డైరెక్టర్ డి.మల్లికార్జున(తిరుపతి రీజనల్ కోడింగ్ సెంటర్) పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ల్యాబ్‌ను ప్రారంభించి మార్కెట్‌లో లభ్యమయ్యే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను సేకరించి వాటి నాణ్యతను పరీక్షిస్తామన్నారు. రైతులకు నాణ్యమైన, స్వచ్ఛమైన వ్యవసాయ వనరులు అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం ల్యాబ్‌కు సరఫరా చేసిన వివిధ పరికరాలు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆత్మా పీడీ మద్దిలేటి, కదిరి ఏడీఏ సత్యనారాయణ, టెక్నికల్ ఏఓ సుమతి, ఏఈఓలు రాఘవేంద్ర, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసనాయక్



పుట్టపర్తి: బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా తిరిగి శ్రీనివాసనాయక్‌ను నియమించారు. పది రోజుల కిందట ఈయనను కర్నూలు జిల్లా కేంద్రంలో ఉన్న కల్లూరుకు డిప్యూటేషన్ మీద పంపారు. జిల్లా కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ లేకపోవటంతో తిరిగి శ్రీనివాసనాయక్ శుక్రవారం విధుల్లో చేరారు. దీంతో ఇక్కడ క్రయ, విక్రయదారుల ఇబ్బందులు తీరనున్నాయి.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



వాలీబాల్ ఆడుతున్న బాలికలు



హాకీలో తలపడుతున్న క్రీడాకారులు



టెన్నిస్ డబుల్స్ చాంపియన్‌గా నిలిచిన నరసింహ, శంకరన్న జోడికి ట్రోఫీని అందిస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు శుక్రవారం స్థానిక అనంత క్రీడా మైదానం, అశోక్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు ఉన్నతంగా రాణించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. రెండు రోజుల పాటు క్రీడా పోటీలను నిర్వహించేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్నామన్నారు. క్రీడాకారులు బాగా రాణించి జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఖోఖో, హాకీ, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, అథ్లెటిక్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ కోచ్‌లు జగన్నాథరెడ్డి, వెంకటరమణ, పీడీలు కేశవమూర్తి, సిరాజ్, నగేష్, శ్రీనివాసులు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఏ1 రఫి, కోచ్‌లు జబీవుల్లా, నరేష్, అనిల్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్ రెడ్డి మృతికి నివాళి..

రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్‌కుమార్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆయన మృతికి మౌనం పాటించి నివాళులర్పించారు. ఆయన మృతి క్రీడాలోకానికి తీరని లోటని అధికారులు పేర్కొన్నారు.

టెన్నిస్ డబుల్స్ విజేత నరసింహ, శంకరన్న జోడి..

ఏపీ సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో శుక్రవారం నిర్వహించిన టెన్నిస్ పోటీల్లో డబుల్స్ విభాగం విజేతలుగా నరసింహ, శంకరన్న జోడి నిలిచింది. గుంతకల్లుకు చెందిన ఆరోన్ రోనాల్డిన్హో, హిందూపురానికి చెందిన గౌతం రెడ్డి జోడిపై 6–4తో విజయం సాధించి జిల్లా చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నారు. శంకరన్న నగరంలోని నంబర్–02 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీడీగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఇటీవల వెటరన్స్ టోర్నీలోను ఆల్ ఇండియా 15వ ర్యాంకును సాధించి ప్రతిభను చాటుకున్నారు. ఆయనను పలువురు పీడీలు, పీఈటీలు ప్రత్యేకంగా అభినందించారు.

కొడిగెనహళ్లి పాఠశాల సందర్శన



ప్రిన్సిపాల్ చాంబర్‌లో సమావేశమైన అగ్నిమాపక శాఖ రాష్ట్ర డైరెక్టర్ మురళీమోహన్

పరిగి: అగ్నిమాపక శాఖ రాష్ట్ర డైరెక్టర్ మురళీ మోహన్ శుక్రవారం కొడిగెనహళ్లి ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించారు. ఈయన 1986 బ్యాచ్‌కు చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి. ఈసందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలు, డార్మెటరీ, తరగతి గదులు, డిజిటల్ లైబ్రరీ, లైబ్రరీ, డైనింగ్ హాల్‌ను పరిశీలించి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై పాఠశాల ప్రత్యేకతను తెలియజేశారు. కష్టపడి చదివితే ఖచ్చితంగా ఉన్నత శిఖరాలను చేరుకుంటారని విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి పరీక్షలను బాగా రాసి మంచి మార్కులు సాధించాలని తెలియజేశారు. అనంతరం పాఠశాలలో ప్రిన్సిపాల్‌తో కలిసి మొక్కలు నాటారు. ఆయన వెంట శ్రీసత్యసాయి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శంకరప్రసాద్, హిందూపురం స్టేషన్ అగ్నిమాపక అధికారి ప్రభాకర్, పూర్వ విద్యార్థులు డాక్టర్ దినకర్(అనంతపురం ప్రభుత్వాసుపత్రి వైద్యుడు), అశ్వర్థనారాయణ ఉన్నారు.

లాడ్జిపై దాడి.. నలుగురి అరెస్ట్

పుట్టపర్తి అర్బన్: ప్రశాంతిగ్రామంలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద ఉన్న ఓ లాడ్జిలో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పుట్టపర్తి డీఎస్పీ యశ్వంత్, సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి వివరాలు వెల్లడించారు. పుట్టపర్తి మండలం పెడపల్లికి చెందిన వడ్డె నాగరాజు మహిళలను తరచూ పుట్టపర్తికి తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తూ డబ్బు సంపాదించేవాడు. ఇతనిపై నిఘా వేసిన పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున మెరుపుదాడులు నిర్వహించారు. వడ్డె నాగరాజు, యోగీశ్వర్‌పై ఉమెన్ ట్రాఫికింగ్ (370) కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. మహిళలను హోంకు తరలించారు. ఆధ్యాత్మిక కేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. లాడ్జిలకు వచ్చే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని డీఎస్పీ నిర్వాహకులకు సూచించారు.

ఉపాధి కూలీల హాజరు పెంచండి



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న పీడీ రామాంజనేయులు

కదిరి టౌన్: ఉపాధి కూలీల హాజరు పెంచాలని డ్వామా పీడీ రామాంజనేయులు సిబ్బందిని ఆదేశించారు. డ్వామా కదిరి క్లస్టర్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి ఆధార్ సంబంధిత చెల్లింపులు మాత్రమే ఉంటాయన్నారు. ఆధార్ అథెంటికేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రిహానా బేగమ్, ప్లాంటేషన్ మేనేజర్ వెంకప్ప, ఈసీ హరిబాబు, ఏపీడీ అసిస్టెంట్ రవిచంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన..

ముదిగుబ్బ: ఉప్పలపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ రామాంజనేయులు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీల మస్టర్ల తనిఖీ చేసి, కూలీల హాజరు వేశారు. అనంతరం పీడీ మాట్లాడుతూ అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా ఉప్పలపాడు చెరువులో పూడికతీత పనుల కోసం రూ.25.68 లక్షలు మంజూరయ్యాయన్నారు. చెరువు పూడికతీత పనులను త్వరతగతిన పూర్తి చేయాలని ఆయన కూలీలకు సూచించారు. అవసరమైతే పక్క పంచాయితీల నుంచి కూలీలను తెచ్చుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సర్పంచ్ లక్ష్మీనారాయణమ్మ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ కమిటీల్లో నాయీబ్రాహ్మణులకు చోటు హర్షణీయం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

పుట్టపర్తి టౌన్: దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల కమిటీల్లో నాయీ బ్రాహ్మణులకు సభ్యత్వం కల్పిస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేయడం హర్షణీయమని నాయీ బ్రాహ్మణులు పేర్కొన్నారు. పట్టణంలోని సాయిఆరామంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేయడంతోపాటు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని కులాలతో సమానంగా నాయీ బ్రాహ్మణులకు దేవదాయ శాఖ పరిధిలోని ఆలయ కమిటీల్లో చోటు కల్పించడం గౌరవప్రదంగా భావిస్తున్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు తమను గుర్తించిన దాఖలాలు లేవన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు తామంతా రుణపడి ఉంటామన్నారు. జిల్లాలో నాయీ బ్రాహ్మణులకు కమ్యూనిటీ భవనం కోసం స్థలం కేటాయించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మాల్యవంతం మారుతీప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, ట్రెజరర్ కమ్మెతం రమేష్, పట్టణాధ్యక్షుడు రాజా, నాయకులు ప్రవీణ్‌కుమార్, నాగరాజు, రమణప్ప, రమణ, గురుప్రసాద్, నారాయణప్ప, చంద్ర, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కొట్టి.. పెట్రోలు పోసి నిప్పంటించారు

• యలహంకలో పరిగి మండల వాసి దారుణ హత్య



శ్రీధర్ (ఫైల్)

పరిగి: మండలంలోని శాసనకోట గ్రామానికి చెందిన శ్రీధర్(34) కర్ణాటక రాష్ట్రం యలహంకలో దారుణ హత్యకు గురయ్యారు. మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు... శాసనకోటకు చెందిన శ్రీధర్ బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేసేవాడు. కొన్నేళ్లుగా తల్లిదండ్రులు ఖాద్రెప్ప, లక్ష్మమ్మ, అన్న ప్రసాద్‌తో కలిసి యలహంకలో నివాసం ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం శ్రీధర్ అదృశ్యం కావడంతో కుటుంబీకులు బంధువుల వద్ద, సమీప ప్రాంతాల్లో ఆరా తీశారు. అయినా ఫలితం లేకపోయింది. ఈక్రమంలోనే యలహంక సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో ఓ మనిషి మృతదేహం కాలిపోయిన స్థితిలో ఉండగా పోలీసులు కనుగొన్నారు. దీంతో అక్కడి పోలీసులు మృతుని వివరాల కోసం పత్రికల్లో ప్రకటన ఇచ్చారు. దీంతో అనుమానంతో అక్కడికి వెళ్లిన శ్రీధర్ సోదరుడు ప్రసాద్ అది తన తమ్ముడి మృతదేహమేనని గుర్తించాడు. దీంతో పోలీసులు మృతదేహం నుంచి నమూనాలు సేకరించి డీఎన్ఏ టెస్టుకు పంపగా.. మృతదేహం శ్రీధర్‌దేనని తేలడంతో పోస్టు మార్టం నిర్వహించారు. అనంతరం శుక్రవారం మృతదేహాన్ని శాసనకోటకు తీసుకొచ్చి దహన సంస్కారాలు నిర్వహించారు. శ్రీధర్‌ను బాగా కొట్టి చంపిన దుండగులు మృతదేహాన్ని గుర్తు పట్టకుండా ఉండేందుకు పెట్రోలు పోసి నిప్పంటించి ఉండవచ్చని బంధువులు అనుమానిస్తున్నారు.

కమనీయం.. సత్యసాయి పర్తియాత్ర



నగర సంకీర్తనను ప్రారంభిస్తున్న ట్రస్ట్ సభ్యుడు రత్నాకర్

పుట్టపర్తి టౌన్: పట్టణంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన సత్యసాయి భక్తులు భక్తి గీతాలు ఆలపిస్తూ శుక్రవారం సత్యసాయి నగర సంకీర్తనను ఘనంగా నిర్వహించారు. మేడ్చల్, మాల్కాజిగిరి జిల్లాలకు చెందిన సత్యసాయి బాబా మహాసమాధి దర్శనార్థం వేలాది మంది భక్తులు తమ జిల్లాల్లో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి పుట్టపర్తికి వచ్చేశారు. హనుమాన్ కూడలి నుంచి విద్యాగిరి ఆర్చ్ వరకూ సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ నగర సవకీర్తనను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు ఆర్‌జే రత్నాకర్ ప్రారంభించారు. కలశాలు, బ్యాండ్ మేళాలతో మందుకు నడవగా కోలాటం, చెక్కల భజనలు, వివిధ రకాల వేషధారణలతో డప్పు వాయిద్యాల మధ్య నగర సంకీర్తన కనుల పండువగా సాగింది. ప్రశాంతి నిలయం గణేష్ గేట్ వద్ద ఈ కార్యక్రమాన్ని ముగించారు. అనంతరం సాయికుల్వంత్ హాల్‌లో మందిరంలో సత్యసాయి సమాధిని వందలాది మంది భక్తులు దర్శించుకొన్నారు. రెండు రోజులు పాటు ప్రశాంతి నిలయంలో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో శుక్రవారం రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ విజయవాడలో రాష్ట్రస్థాయి బాల, బాలికల అండర్–17 బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. ఈ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి అనంతపురం బాల బాలికల జట్లకు పట్టణానికి చెందిన తరుణ్, సల్మా, నిఖ్య ఎంపికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, ఉపాధ్యక్షుడు నిమ్మ చంద్ర, కోచ్ సంజయ్, పీఈటీ వీర పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు





ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు, గాయపడిన అక్రమ్

సోమందేపల్లి: మండలంలోని వెలుగుమాకులపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై రెండు బస్సులు ఢీకొన్న సంఘటనలో నలుగురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. శుక్రవారం తెల్లవారుజామున బెంగళూరు వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న కెఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్ వెలుగుమాకులపల్లి క్రాస్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో హఠాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వైపు నుంచి వస్తున్న మరో బస్సు ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న అక్రమ్, సుమేల్, పవన్‌తోపాటు అదనపు డ్రైవర్ లింగం గాయపడ్డారు. ఏఎస్ఐ మురళి అక్కడికి చేరుకుని క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి ఆత్మహత్య



జ్యోతి (ఫైల్)

పుట్టపర్తి టౌన్: కడుపు నొప్పి తాళలేక యువతి ఆత్మహత్య చేసుకుటున్న ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి వరాల మేరకు.. పట్టణంలోని 2వార్డు కోటవీధికి చెందిన జీమాను గంగాద్రి, శివమ్మ పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. చిన్న కుమార్తె జ్యోతి(27) అమ్మకు చేదోడువాదోడుగా ఉంటోంది. అయితే జ్యోతి తరచూ కడుపునొప్పితో బాధపడుతుండేది. శుక్రవారం ఉదయం కడుపునొప్పి అధికం కావడంతో క్రిమి సంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత వైద్యుల సూచనల మేరకు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థిని బలవన్మరణం

కదిరి టౌన్: కదిరి మండలం మొటుకుపల్లిలో ఓ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. రూరల్ సీఐ సూర్యనారాయణ వివరాల మేరకు..గాండ్లపెంట మండలం తూపల్లికి చెందిన యజ్ఞప్రియారెడ్డి(20) అనంతపురంలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతోంది. సెమిస్టర్‌లో మార్కులు తక్కువ వచ్చాయని మనస్థాపానికి గురై మొటుకుపల్లిలో వారి అమ్మమ్మ ఇంటికి చేరుకుంది. శుక్రవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగులు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగానే మృతి చెందింది. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి



వెంకటలక్ష్మమ్మ మృతదేహం

హిందూపురం: పట్టణంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ వృద్ధురాలు మృతి చెందింది. టూ టౌన్ పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని 2వ మోడల్‌కాలనీలో వెంకటలక్ష్మమ్మ(68) నివాసముంటోంది. శుక్రవారం ఉదయం ఇంట్లోని బాత్‌రూంలో విద్యుత్ వైరు తెగి వేలాడుతుండగా గమనించకుండా పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుమారుడు వెంకటేష్‌బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీ దేవి

రొళ్ల: మండల పరిధిలోని లక్కప్పనపల్లిలో శుక్రవారం కొల్హాపురి మహాలక్ష్మీ దేవికి జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీ దేవి అమ్మవారిని ఒకరోజు ముందే స్వగ్రామానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. తర్వాత మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను మోసుకుని మేళతాళాలతో ఊరేగింపుగా పట్టం కూర్చోబెట్టిన ప్రదేశానికి వెళ్లారు.అమ్మవారి చుట్టూ ప్రదక్షణలు చేసి జ్యోతులను సమర్పించారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మేకల మందపై చిరుత దాడి

పెనుకొండ రూరల్: గొందిపల్లి సమీపంలో పెనుకొండ కొండలో మేకల మందపై చిరుత దాడి చేసింది. గ్రామానికి చెందిన మేకలకాపరి నరసింహులు రోజులాగే తన వంద మేకలను మేతకోసం సమీప అటవీప్రాంతానికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం దాదాపుగా సమయంలో మందపై చిరుత దాడి చేసి మేకను పట్టుకుంది. దీంతో కాపరిగట్టిగా కేకలు వేయడంతో వదిలివెళ్లింది. ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మేకల భద్రతపై అవగాహన కల్పించినట్లు బీట్ ఆఫీసర్ దివాకర్ తెలిపారు.